పల్లె వైద్యంతో ప్రజలకు భరోసా 6లో..

ప్రజాస్వామ్య ప్రక్రియను నిలబెట్టడమే కాంగ్రెస్ లక్ష్యం 5లో..



వెనుకబాటు..!

- సక్రమంగా సాగని స్త్రీ నిధి రుణాలు
- జిల్లా లక్ష్యం రూ. 114.50 కోట్లు
- ఇప్పటివరకు రూ. 55.94 కోట్లు మాత్రమే అందజేత
- యాభై శాతం కూడా మించని లక్ష్యం

జగిత్యాల, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో మహిళా సంఘాలకు స్త్రీ నిధి రుణాలు సక్రమంగా అందడం లేదు. బ్యాంకు లింకేజీ ద్వారా లక్ష్యానికి మించి రుణాలిస్తుంటే స్త్రీనిధిలో మాత్రం తడబాటు కనిపిస్తోంది. ఒకప్పుడు టార్గెట్‌ను దాటి రుణాలు అందించి రాష్ట్రస్థాయి ప్రశంసలు అం దుకున్న జిల్లానే ఇప్పుడు పూర్తిగా వెనుకబడింది. స్త్రీనిధిలో పొంతన లేని నిబంధనలు ఉండడంతో స్వయం సహాయక సంఘాల (ఎస్‌హెచ్‌జీ) మ హిళలకు సులువుగా రుణాలు ఇవ్వలేకపోతున్నామని అధికారులు కారణం గా చెబుతున్నారు. పేదింటి మహిళలు ఆర్థికంగా ఎదగడానికి రాష్ట్ర ప్రభు త్వం స్త్రీనిధి పథకం ద్వారా ప్రతి యేటా రుణాలు అందిస్తూ వస్తోంది. ఇం దుకు జిల్లాకు టార్గెట్‌ను నిర్దేశించి సంబంధిత ఆర్థిక సంవత్సరంలోగా పూర్తి చేయాలని ఆదేశాలుంటాయి. కానీ గత యేడాది కాలంగా స్త్రీ నిధి రుణ పంపిణీ లక్ష్యానికనుగుణంగా జరగడం లేదు. 2021-22 ఆర్థిక సంవ త్సరంలో జిల్లాలో స్త్రీ నిధి రుణాల పంపిణీ లక్ష్యం రూ. 114.50 కోట్లు కా గా, సుమారు రూ. 50.8 కోట్ల స్త్రీ నిధి రుణాలు అందించారు. ఇంకా రూ. 58.56 కోట్ల స్త్రీ నిధి రుణాలను పంపిణీ చేయాల్సి ఉంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఇప్పటివరకు కేవలం 48 శాతం మాత్రమే స్త్రీ నిధి రుణాలు అందించారు. మార్చి వరకు మరో 52 శాతం రుణాలు అందించడం ప్రశ్నార్థకంగా తయారయింది.

● వెనుక బడిన మండలాలు ఇవే...

జిల్లాలో పలు మండలాలు పూర్తిగా వెనుకబడ్డాయి. ఈ మండలాల్లో రుణాల పంపిణీని వేగవంతం చేయడానికి ఇటీవల సమావేశం నిర్వహిం చినట్లు డీఆర్‌డీవో వార్గలు అంటున్నాయి. ఇందులో ఇబ్రహీంపట్నం మం డలం 21.10 శాతం లక్ష్యం, వెల్గటూరు 21.66 శాతం, బుగ్గారం 21.71 శా తం, కోరుట్ల 22.79 శాతం, గొల్లపల్లి 25.60 శాతం, పెగడపల్లి 29.19 శా తం, ధర్మపురి 29.74 శాతం, కథలాపూర్ 32.87 శాతం, రాయికల్ 35.18 శాతం, సారంగపూర్ 43.82 శాతం లక్ష్యాన్ని సాధించాయి. అదే విధంగా మల్లాపూర్ మండలం 43.90 శాతం, కొడిమ్యాల 48.18 శాతం, జగిత్యాల రూరల్ 51.13 శాతం, జగిత్యాల పట్టణం 51.69 శాతం, మల్యాల 56.32 శాతం, మెట్‌పల్లి మండలం 58.21 శాతం, మేడిపల్లి 60.46 శాతం, కోరుట్ల 58.53 శాతం, మెట్‌పల్లి 95.15 శాతం స్త్రీ నిధి రుణాల పంపిణీని పూర్తి చేశాయి.

● జిల్లాలో ఎస్‌హెచ్‌జీల పరిస్థితి..

జిల్లా వ్యాప్తంగా 565 గ్రామాఖ్య సంఘాలు, 14,938 స్వశక్తి మహిళా సంఘాలున్నాయి. ఇందులో సుమారు 1,77,068 మంది స్వయం సహాయ క సంఘాల మహిళా సభ్యులున్నారు. స్వశక్తి సంఘాలకు బ్యాంకు లింకేజీ ద్వారా రుణాలు అందిస్తున్నారు. సంఘ సభ్యులకు ఆర్థికంగా భరోసా కల్పి స్తూ, జీవనోపాదులు ఏరాపటు చేసుకోవడం కోసం బ్యాంకుల ద్వారా ఒ క్కో సంఘానికి రూ. 50 వేల నుంచి రూ. 7.50 లక్షల వరకు రుణ సౌక ర్యం కల్పిస్తున్నారు. గత యేడాది జిల్లా వ్యాప్తంగా 12,786 సంఘాలకు రూ. 446.74 కోట్లు రుణాలు అందించాలన్న లక్ష్యానికి గాను 9,390 సం ఘాలకు రూ. 448.32 కోట్ల రుణాలను అందించారు. లక్ష్యానికి మించి బ్యాంకు లింకేజీ రుణాలు ఇచ్చారు. అదేవిధంగా స్త్రీ నిధి పథకం కింద 2021-22లో జిల్లాలో 13,645 సంఘాలకు రూ. 106.78 కోట్ల రుణాలను అందించారు. సౌభాగ్య పథకం కింద సంఘ సభ్యురాలికి రూ. 3 లక్షల వరకు జీవనోపాధి కోసం రుణం మంజూరు చేస్తున్నారు. జిల్లాలో పల్లె సమగ్ర సేవ కేంద్రాలు స్త్రీ నిధి ద్వారా గ్రామ స్థాయిలో ఆన్‌లైన్ బ్యాంకిం గ్ సేవలు, జనన, మరణ ధృవీకరణ పత్రాలు, రెవన్యూ సంబంధిత పత్రా లు ప్రజలు చేరువలో ఉంచుతున్నారు. జిల్లా వ్యాప్తంగా 77 పల్లె సమగ్ర సేవ కేంద్రాలు ఏర్పాటు చేసి రూ. 500 కోట్లకు పైగా లావాదేవీలు నిర్వ హిస్తున్నారు.

● జిల్లాలో పంపిణీ చేసిన రుణాలు..

జిల్లా వ్యాప్తంగా అన్ని ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రూ. 1,145 కోట్ల స్త్రీ నిధి రుణాల పంపిణీ లక్ష్యానికి గాను ఇప్పటివరకు సుమారు రూ. 55.94 కోట్లు మాత్రమే రుణాలిచ్చారు. అదే బ్యాంకు లింకేజీ రుణాల విష యానికి వస్తే సునాయసంగా సుమారు 10 వేల సంఘాలకు దాదాపు రూ. 500 కోట్ల లోన్లు ఇచ్చారు. బ్యాంకు లింకేజీ టార్గెట్‌తో పోలిస్తే స్త్రీనిధి లక్ష్యం చాలా చిన్నది. ఒకటి, రెండు మండలాలు మినహా అన్ని ఇతర మండలాలు లక్ష్యానికి చాలా దూరంలో ఉన్నాయి. చాలా మండలాలు 20 శాతం నుంచి 60 శాతం లోపు లక్ష్యాన్ని సాధించాయి. వచ్చే నెలాఖరు లో పు వంద శాతం పూర్తి చేయడం ప్రశ్నార్థకంగా తయారైంది.

45 రోజుల్లో రూ. 58.56 కోట్లు సాధ్యమేనా....

ఈ ఏడాది లక్ష్యాన్ని వచ్చే మార్చి నెలాఖరు నాటికి పూర్తి చేయాల్సి ఉంది. రానున్న 45 రోజుల్లో ఇంకా దాదాపు రూ. 58.56 కోట్ల రుణాలను మహిళా సంఘాలకు పంపిణీ చేయాల్సి ఉంటుంది. ప్రస్తుత పరిస్థితి చూ స్తే రూ. 50 కోట్లు కూడా అయ్యేలా లేదు. ఒకటి, రెండు మండలాల్లోనే లక్ష్యానికి మించి .రుణాలిచ్చారు. అయితే గతేడాది నుంచి స్త్రీ నిధిలో కొత్త నిబంధనలు రావడంతో రుణాలివ్వడం సులువు కావడం లేదు. ఒక వీవో లో ఉన్న అన్ని మహిళా సంఘాల్లో కనీసం సగం సంఘాలైనా పూర్తి రు ణాలను చెల్లిస్తే మళ్లీ కొత్తగా స్త్రీనిధి రుణం ఇవ్వడానికి అవకాశం ఉంది. ఇలా జిల్లాలో చాలా గ్రామాల్లో సంఘాలు బకాయిలున్నాయి. అలాగే ఆన్‌లైన్ పద్ధతిలోనే రుణాలు ఇవ్వాలనే నిబంధన కూడా ఉండడంతో అధి కారులకు ఎక్కువ సమయం పడుతోంది. తద్వారా నిర్దేశిత లక్ష్యానికి అను గుణంగా రుణాలు ఇవ్వడం సాధ్యపడడం లేదు. అదే విధంగా ఐకేపీ ఏపీ ఎంలు, సీసీల నుంచి కూడా స్త్రీ నిధి ఉద్యోగులకు సహకారం అందడం లే దనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. అయితే, రుణాలను పూర్తిగా చెల్లించి కొ త్త రుణం కోసం జిల్లాలో చాలామంది మహిళలు ఎదురు చూస్తున్నారు. సులభ వాయిదా పద్ధతిలో చెల్లించే స్త్రీనిధి రుణాలు రావాలని అధికారు లను వారు కోరుతున్నారు.

లక్ష్యం మేరకు పూర్తి చేయడానికి చర్యలు

- పి. నరేశ్, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి



జిల్లాలో స్వయం సహాయక మహిళా సంఘాల సభ్యులకు ప్రభుత్వ ల క్ష్యం మేరకు స్త్రీ నిధి రుణాలను పంపిణీ చేయడానికి అవసరమైన చర్య లు తీసుకుంటున్నాము. ఇప్పటికే సంబంధిత ఐకేపీ ఏపీఎంలు, సీసీలకు అవసరమైన సలహాలు, సూచనలు ఇవ్వడం జరిగింది. ఎస్‌హెచ్‌జీ మహి ళలకు స్త్రీ నిధి రుణాలపై అవగాహన కల్పించి పంపిణీ చేయడంపై దృష్టి సారించాము.

ఎమ్మెల్సీ కవితతో కౌన్సిలర్ల భేటీ

- ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ ఆధ్వర్యంలో మంతనాలు
- సమావేశానికి దూరంగా ఉండాలని నిర్ణయం



కవితకు పుష్పగుచ్చం అందజేస్తున్న కౌన్సిలర్లు

జగిత్యాల టౌన్, ఫిబ్రవరి 13 : జగిత్యాల బల్దియా వైస్ చైర్మన్ గోలి శ్రీనివాస్‌పై అదే పార్టీకి చెందిన కౌన్సిలర్లు పెట్టిన అవిశ్వాస తీర్మాన పంచాయితీ హైదరాబాద్‌కు చేరుకుంది. మంగళవారం ఉదయం హైదరాబాద్‌లో ఎమ్మెల్సీ కవితతో కౌన్సిలర్లు బేటీ అయ్యారు. వైస్ చైర్మన్ గోలి శ్రీనివాస్‌పై పెట్టిన అవిశ్వాస తీర్మానంపై ఎమ్మెల్యే సంజయ్ కుమార్, ఎమ్మెల్సీ రమణల నేతృత్వంలో కౌన్సిలర్లు ఎమ్మెల్సీ కవితతో కీలక మంతనాలు జరిపారు. సొంత బీఆర్ఎస్ పార్టీకి చెందిన కౌన్సిలర్లే అవిశ్వాసం పెట్టడంపై కవితతో పాటు ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు వ్యతిరేఖించడంతో కౌన్సిలర్లు వెనక్కితగ్గారు. బుధవారం నిర్వహించాల్సిన ఆవిశ్వాస తీర్మాన ఓటింగ్‌కు దూరంగా ఉండాలని నిర్ణయంచుకున్నట్లు తెలిసింది. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ పార్టీ అందరికి అవకాశాలు ఇచ్చిందని రానున్న రోజుల్లో మరిన్ని సమానావకాశాలు కల్పిస్తుందని పేర్కొన్నారు. బీఆర్ఎస్ అంటేనే క్రమ శిక్షణ పార్టీలాగా వ్యవహరించాలన్నారు. అధికార పార్టీ అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేఖ విధానాలపై పోరాడాలని పిలుపునిచ్చారు.

భక్తులతో కిక్కిరిసిన అంజన్న క్షేత్రం



భక్తులతో రద్దీగా ఉన్న ఆలయ పరిసర ప్రాంతం

మల్యాల, ఫిబ్రవరి 13: కొండగట్టు అంజన్న క్షేత్రం మంగళవారం భక్తులతో వేలాదిగా కిక్కిరిసింది. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన సమ్మక్క సారక్క భక్తులతో రద్దీగా మారింది. సమ్మక్క సారక్క దర్శనాల ముందు కొండగట్టు అంజన్నకు తొలి మొక్కులు తీర్చుకునేందుకు భక్తులు కొండగట్టుకు తరలివస్తున్నారు. వేలాదిగా తరలివచ్చిన భక్తులతో ఆలయ పరిసరాలు కిక్కిరిసాయి. సోమవారం రాత్రికే కొండపైకి చేరుకున్న భక్తులు వేకువజాము నుంచే స్వామి వారి దర్శనానికి బారులు తీరారు. ఆలయానికి వచ్చే మార్గాలు, కోనేరు పరిసరాలు భక్తులతో నిండిపోయాయి. అనంతరం బేతాళుడు, శ్రీరాముల వారిని కూడా దర్శించుకున్నారు. భక్తుల రద్దీ రోజంతా కొనసాగింది. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఆలయ ఈవో వెంకటేష్, ఏఈవో వైరాగ్యం అంజయ్య, పర్యవేక్షకులు శ్రీనివాస్‌శర్మ, పోలీసులు ఇతర అధికారులు పర్యవేక్షించారు. వందలాది వాహనాలతో ఘాట్‌రోడ్డు, జేఎన్‌టీయూ మార్గం నిండిపోయి రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. భక్తుల రద్దీ దృష్ట్యా ఆలయంలో నిత్యం జరిగే అభిషేకాలు, సత్యనారయణ వ్రతాలు, వాహనపూజలు నిలిపి వేశారు.

రాయికల్‌వాసికి బెస్ట్ ట్రైనర్ అవార్డు

రాయికల్, ఫిబ్రవరి 13: రాయికల్ పట్టణానికి చెందిన ద్యావనపెల్లి సుధీర్ ఇంపాక్ట్ సదస్సులో బెస్ట్ ట్రైనర్ అవార్డును అందుకున్నాడు. ఈ నెల 10, 11 తేదీల్లో హైదరాబాద్‌లో జరిగిన ఇంపాక్ట్ సదస్సులో గంప నాగేశ్వర్‌రావు చేతులమీదుగా అవార్డు అందుకున్నాడు. అవార్డు గెలుచుకున్న సుదీర్‌ను పలువురు అభినందించారు.

ప్రభుత్వ విప్‌ను కలిసిన మల్కాజ్‌గిరి ఏసీపీ



లక్ష్మణ్‌కుమార్‌ను పుష్పగుచ్ఛం అందిస్తున్న మల్కాజ్‌గిరి ఏసీపీ

ధర్మపురి, ఫిబ్రవరి 13: హైదరాబాద్‌లో ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌ను మంగళవారం మల్కాజ్‌గిరి ఏసీపీ పురుషోత్తంరెడ్డిని మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ధర్మపురి ఎమ్మెల్యేగా గెలిచి ప్రభుత్వ విప్‌గా నియమించబడిన అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌ను ఆయన కలిసి పుష్పగుచ్ఛం అందించారు. లక్ష్మణ్‌కుమార్ ఆయనకు స్వాగతం పలికారు.

న్యాయవాదుల సమస్యల పరిష్కారానికి కృషి



న్యాయవాదులతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ

జగిత్యాల టౌన్, ఫిబ్రవరి 13 : న్యాయవాదుల సమస్యల పరిష్కారానికి తన వంతుగా కృషి చేస్తానని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి హామీ ఇచ్చారు. జిల్లా కేంద్రంలోని కోర్టు సముదాయాన్ని మంగళవారం ఎమ్మెల్సీ సందర్శించారు. ఈ సందర్భంగా న్యాయవాదులతో ప్రత్యేక సమావేశం నిర్వహించి పలు సమస్యలపై చర్చించి మాట్లాడారు. కోర్టు ఆవరణలో మౌలిక వసతుల కల్పించడం తన బాధ్యతగా తీసుకుంటానన్నారు. కోర్టు భవనంలో రెండో అంతస్తు నిర్మాణానికి నిధులు కేటాయిస్తానన్నారు.

నైపుణ్య శిక్షణతో ఉపాధి అవకాశాలు

జిల్లా ఉపాధికల్పనా అధికారిణి సత్తెమ్మ

జగిత్యాల అర్బన్, ఫిబ్రవరి 13: విద్యార్హతతో పాటు, నైపుణ్య శిక్షణ పొందిన యువతకు సమాజంలో విస్తృత అవకాశాలు ఉన్నాయని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఉపాధికల్పనా అధికారిణి సత్తెమ్మ అన్నారు. జగిత్యాల జిల్లా కేంద్రంలోని స్థానిక శివసాయి రెసిడెన్సిలో తెలంగాణ రాష్ట్ర ఉపాధి మరియు శిక్షణ శాఖ ఆధ్వర్యంలో నైపుణ్యాభివృద్ధి మంత్రిత్వ శాఖ తరుపున నిర్వహించిన సంకల్ప్ పథకంలో భాగంగా మహిళలకు నిర్వహించిన ఉపాధి శిక్షణ అవగాహన కార్యక్రమానికి సత్తెమ్మ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సంకల్ప్ పథకంలో భాగంగా మహిళలకు కుట్టు శిక్షణ అందించామన్నారు. దీనిద్వారా శిక్షణార్థులు ఉపాధిని పొందవచ్చన్నారు. జగిత్యాల జిల్లాలో ఎంప్లాయిమెంట్ కార్యాలయం తరుపున ప్రతి నెల ప్రైవేట్ రంగంలో వివిధ ఉద్యోగ అవకాశాలను కల్పిస్తూ, వీటి భర్తీకై ఇంటర్వ్యూలు నిర్వహిస్తూ ఎంపిక చేస్తున్నామన్నారు. అందరికీ ప్రభుత్వ ఉద్యోగాలు కల్పించడం సాధ్యం కాదని, కావున ప్రైవేట్ రంగంలో ఉన్న విస్తృత అవకాశాలను సద్వినియోగం చేసుకొని యువత ముందుకు సాగాలన్నారు. ఏదైనా శిక్షణ పొందాలంటే హార్డ్‌వర్క్‌తో పాటు, స్మార్ట్ వర్క్ ప్రధానం అని, మన నైపుణ్య ప్రతిభ ఆధారంగానే అవకాశాలు లభిస్తాయన్నారు. ప్రస్తుత సమాజంలో మార్కెటింగ్, సేల్స్ రంగాల్లో విశేష అవకాశాలను సద్వినియోగం చేసుకొని ముందుకు సాగాలన్నారు. అనంతరం కుట్టు మిషన్ శిక్షణార్థులకు సర్టిఫికెట్లు ప్రధానం చేశారు.



సమావేశంలో మాట్లాడుతున్న సత్తెమ్మ

ఈ కార్యక్రమంలో ఏపీ ప్రొడక్టివిటీ కౌన్సిల్ ప్రాజెక్టు కోఆర్డినేటర్ ఎన్.వి దుర్గారెడ్డి, ట్రైనర్ రామరాయులు, సీనియర్ అసిస్టెంట్ లింగమూర్తితో పాటు కుట్టు మిషన్ శిక్షణార్థులున్నారు.

ఘనంగా శ్యామలదేవి నవరాత్రుల ఉత్సవం



కుంకుమ పూజల్లో పాల్గొన్న మహిళలు

మెట్‌పల్లి, ఫిబ్రవరి, 13 : పట్టణంలోని పెద్దమ్మ ఆలయంలో శ్యామలదేవి నవరాత్రుల ఉత్సవాల్లో భాగంగా సౌభాగ్య కాత్యాయని దేవి వ్రతాలను మహిళలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. మంగళవారం పట్టణంలోని పెద్దమ్మ ఆలయంలో ఉదయం నుంచి శ్యామలదేవి, కాత్యాయనీ దేవి, శ్రీవల్లి దేవసేన, సుబ్ర హ్మణ్యేశ్వర స్వామి ఉత్సవ మూర్తులకు క్షీరాభిషేకం, పుష్పార్చన తదితర కార్యక్రమాలను నిర్వహించారు. ఉత్సవ మూర్తులతో భక్తులు ఆలయం చుట్టూ ప్రద క్షణలు చేసి శ్రీ శ్యామలదేవి, కాత్యాయని దేవి వ్రతాలు, కుంకుమ పూజలు ఆలయ పురోహితుడు మదన్‌శర్మ మంత్రోచ్చారణల మధ్య వైభవంగా జరిపించారు. అనంతరం సామూహిక వ్రతాలు, కుంకుమ పూజ చేశారు. భక్తులు వివిధ రకాల పండ్లను స్వామి వారికి అందజేయగా తదితర కార్యక్రమాలను భక్తులచే జరిపించారు. అనంతరం శ్రీ ఐశ్వర్యలక్ష్మి గోశాల తరు పున గాజుల పూజ నిర్వ హించారు. భక్తులు గోశాలలోని ఆవులకు ఆహారం అందజేసి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, భక్తులు పాల్గొన్నారు.

ధర్మపురి మార్కెట్ కమిటీ పాలకవర్గం రద్దు

ధర్మపురి, ఫిబ్రవరి 13: ధర్మపురి వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలకవర్గం రద్దు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్, వైస్‌చైర్మన్, కమిటీ సభ్యుల పాలకవర్గాన్ని రద్దు చేస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలకవర్గం రద్దు కావడం వల్ల చైర్మన్, వైస్‌చైర్మన్, కమిటీ సభ్యుల పదవులు ఖాళీ అయ్యాయి. ఇదిలా ఉండగా జగిత్యాల జిల్లా మార్కెటింగ్ ఆఫీసర్‌ను ధర్మపురి వ్యవసాయ మార్కెట్ కమిటీ పర్సన్ ఇన్‌చార్జ్‌గా నియమించారు

పొద్దున బాధ్యతల స్వీకరణ. సాయంత్రం బదిలీ..

ఎండపల్లి, ఫిబ్రవరి 13 : మండల తహసీల్దార్ ఉదయం బాధ్యతలు స్వీకరించడం, సాయంత్రం బదిలీ కావడం చర్చనీయాంశంగా మారింది. ఉదయం పదవి చేపట్టిన బి. రాజమణి ఒక్క రోజు గడవకముందే బదిలీ అయ్యారు. ఇంతకు ముందు పెద్దపల్లిలో పని చేసిన ఆమె మంగళవారం ఎండపల్లి తహసీల్దార్‌గా ఒక్క రోజు బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పని చేసిన తహసీల్దార్ మెండి ఉదయ్‌కుమార్ ఆసిఫాబాద్‌కు బదిలీ అయ్యారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

కొడిమ్యాల, ఫిబ్రవరి 13 : సైబర్ మోసాలకు గురి కాకుండా ప్రజలు అవగాహన కలిగి ఉండాలని జిల్లా లీడ్ బ్యాంక్ ఎఫ్‌ఎల్‌సీ కోట మదుసూధన్ అన్నారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ అపరిచిత వ్యక్తుల నుంచి వచ్చే ఫోన్‌కాల్స్, మెసేజీల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. ఏ బ్యాక్ అధికారులైనా ఖాతాదారుల వివరాలు అడగరన్నారు. అనవసరమైన సైట్లు వాడకపోవడమే మంచిదన్నారు. నాచుపల్లిలో లక్ష 25వేల రూపాయలు సైబర్ మోసం ద్వారా కోల్పోవటం దురదృష్టకరమన్నారు. సైబర్ మోసాల ద్వారా డబ్బులు కోల్పోతే వెంటనే క్రైం టోల్ ఫ్రీ నెం. 1930కి కాల్ చేసి ఫిర్యాదు చేయాలన్నారు.

సోషల్ మీడియాలో తప్పుడు ఆరోపణలు నమ్మొద్దు

ప్రజలకు ట్రాన్స్‌జెండర్‌ల విజ్ఞప్తి

జగిత్యాల అర్బన్, ఫిబ్రవరి 13: ట్రాన్స్ జెండర్‌ల ముసుగులో పిల్లలను కిడ్నాప్ చేస్తున్నారంటూ తమను పోలిన వ్యక్తుల ఫొటోలు సోషల్ మీడియాలో విస్తృతంగా ట్రోల్ అవుతున్నందున వారిని ట్రాన్స్ జెండర్‌లుగా భావించవద్దని, పిల్లల కిడ్నాపర్లకు, ట్రాన్స్‌జెండర్‌లకు సంబంధం లేదని ట్రాన్స్‌జెండర్స్ జిల్లా అధ్యక్షురాలు నిహారిక ప్రజలకు విజ్ఞప్తి చేశారు. జిల్లా కేంద్రంలోని స్థానిక ఆర్టీసీ బస్టాండ్‌లో తమ ఐడీ, ఆధార్ కార్డులను చూపిస్తూ అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ట్రాన్స్‌జెండర్‌లకు పిల్లలను కిడ్నాప్ చేసే అవసరం లేదన్నారు. తమ జీవన విధానం శుభకార్యాల వద్ద బిక్షాటన ద్వారా ఉపాధి పొందుతున్నామన్నారు. ఇప్పుడిప్పుడే తమకు ప్రజల్లో గుర్తింపు ఆదరణ వస్తుందని, దానిపై బురదజల్లే ప్రయత్నం చేయవద్దన్నారు. సోషల్ మీడియాలో తమ వేషధారణతో ఉన్న ఫొటోలు ప్రచారం అవుతుంటే, ప్రజలు తమను తప్పుగా భావించే అవకాశం ఉందన్నారు. సోషల్ మీడియాలో వచ్చే వదంతులు నమ్మవద్దని 24గంటల రక్షణ పోలీసులు అందిస్తున్నారని గమనించాలన్నారు. ప్రజలు సైతం కొంత అప్రమత్తంగా ఉండాలని విజ్ఞప్తి చేశారు. నిజమైన ట్రాన్స్ జెండర్‌లు ఇలాంటి చర్యలకు పాల్పడరన్నారు. తమకు ప్రభుత్వం ఐడీ కార్డులతో పాటు, ఆధార్ కార్డులను అందించిందనే విషయాన్ని గమనించాలని కోరారు. అనుమానితులు కనిపిస్తే, వారి వద్ద గుర్తింపు కార్డుల ద్వారా వాస్తవాలు వెలుగులోకి వస్తాయన్నారు. సంఘ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే చట్టపరంగా చర్యలు తీసుకోవచ్చని, చట్టానికి ఎవరూ అతీతులు కాదన్నారు. ఈ కార్యక్రమంలో ట్రాన్స్‌జెండర్‌లు పాల్గొన్నారు.



గుర్తింపు కార్డులు చూపిస్తున్న ట్రాన్స్‌జెండర్‌లు

వ్యవసాయ బావిలో మొసలి


బావి నుంచి బయటకు తీసిన మొసలి

రాయికల్, ఫిబ్రవరి 13: మండలంలోని దావన్‌పెల్లి గ్రామంలో కుర్ర శేఖర్ అనే రైతుకు చెందిన వ్యవసాయ బావిలో సోమవారం మొసలిని గుర్తించారు. ఈ సందర్భంగా భయాందోళనకు గురైన శేఖర్ గ్రామస్థుల సహాయంతో మొసలిని పట్టి అటవీ శాఖ అధికారులకు అప్పగించారు. వ్యవసాయ బావిలోని నీరు ఎండిపోవడంతో మొసలి కనబడిందని, లేకుంటే ప్రమాదం పొంచి ఉండేదని రైతులు పేర్కొంటున్నారు.

బద్ది పోచమ్మ ఆలయంలో భక్తుల రద్దీ


బోనం మొక్కు చెల్లించుకుంటున్న భక్తులు

వేములవాడ, ఫిబ్రవరి 13: రాజరాజేశ్వర స్వామివారి అనుబంధ దేవాలయమైన బద్ది పోచమ్మ ఆలయం మంగళవారం భక్తులతో కిటకిటలాడింది. మేడారం సమ్మక్కసారక్క జాతరకు వెళ్లడానికి ముందు ఆనవాయితీ ప్రకారం సోమవారం తమ ఇష్టదైవమైన రాజరాజేశ్వర స్వామిని దర్శించుకున్న వేలాది మంది భక్తులు మంగళవారం బద్ది పోచమ్మ అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా వారు తెల్లవారుజామునే భక్తిశ్రద్ధలతో నైవేద్యం వండి బోనం తయారుచేసి ఊరేగింపుగా ఆలయం వద్దకు చేరుకున్నారు. బద్ది పోచమ్మ అమ్మవారికి బోనం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. భారీ సంఖ్యలో జనం తరలి రావడంతో క్యూలైన్లు కిక్కిరిసిపోయాయి. అమ్మవారి దర్శనానికి సుమారు రెండు గంటలకు పైగా సమయం పట్టింది.

అనారోగ్యంతో ఒకరి ఆత్మహత్య

కరీంనగర్ క్రైం, ఫిబ్రవరి 13: అనారోగ్యంతో బాధపడుతున్న గౌతమి నగర్‌కు చెందిన అమ్మిగల్ల చంద్రయ్య(46) మంగళవారం ఆత్మహత్య చేసుకున్నాడని ఒకటో ఠాణా పోలీసులు తెలిపారు. మున్సిపల్‌లో కూలీగా పనిచేస్తున్న చంద్రయ్య అనారోగ్యంతో మందులు వాడుతున్నప్పటికీ నొప్పి తగ్గక పోవటంతో ఇంటిలో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు మృతుడి భార్య రజిత పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొంది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

విద్యుత్ చౌర్యం కేసులో ముగ్గురికి జైలు

కరీంనగర్ క్రైం, ఫిబ్రవరి 13: విద్యుత్ చౌర్యం కేసులో ఇద్దరు నిందితులకు సోమవారం, మరొక నిందితుడికి మంగళవారం జిల్లా మొదటి అదనపు న్యాయమూర్తి శ్రీవాణి జైలు శిక్ష, జరిమానా విధించినట్లు ట్రాన్స్‌కో విజిలెన్స్ ఎస్ఐ టి నరేష్ తెలిపారు. తిమ్మాపూర్ మండలం పర్లపల్లికి చెందిన మామిడి అర్జున్‌కు 3,658 రూపాయల జరిమానా లేదా 3 నెలల సాధారణ జైలుశిక్ష, కొత్తపల్లి మండలం రేకుర్తికి చెందిన పొత్తూరి సుధాకర్‌కు 13,621 రూపాయల జరిమానా లేదా 3 నెలల సాధారణ జైలు శిక్ష విధించినట్లు తెలిపారు. మానకొండూర్ మండలం శ్రీనివాసనగర్‌కు చెందిన వరికోలు సంపత్‌కు 4,691 రూపాయల జరిమానా లేదా 3 నెలల సాధారణ జైలు శిక్ష విధించినట్లు తెలిపారు.

పీజీ మొదటి సెమిస్టర్ పరీక్షల షెడ్యూలు విడుదల

గణేశ్‌నగర్ ఫిబ్రవరి13: శాతవాహన విశ్వవిద్యాలయం పరిధిలో జరగనున్న పీజీ మొదటి సెమిస్టర్, సిబిసిఎస్ రెగ్యులర్, బ్యాక్‌లగ్ పరీక్షలు ఈ నెల 27 నుంచి మార్చి2 వరకు జరగనున్నట్లు శాతవాహన విశ్వవిద్యాలయం పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ ఎన్‌వి శ్రీరంగప్రసాద్ తెలిపారు. పరీక్షలు మధ్యాహ్నం రెండు గంటల నుంచి సాయంత్రం వీ గంటల వరకు కొనసాగుతాయని తెలిపారు.

విద్యార్థుల ఆత్మహత్యలపై ప్రభుత్వం స్పందించాలి

గణేశ్‌నగర్,ఫిబ్రవరి 13: విద్యార్థుల ఆత్మహత్యలపై ప్రభుత్వం స్పందించాలని ధర్మ సమాజ్ పార్టీ(డిఎస్‌పి) ధర్మ స్టూడెంట్స్ యూనియన్(డిఎస్‌యు) నాయకులు గీతాభవన్ నుంచి కలెక్టరేట్ వరకు కొవ్వొత్తులతో నిరసన చేపట్టారు. సూర్యాపేట జిల్లా దురాజల్లి సమీపంలోని ఇమాంపేట సాంఘిక సంక్షేమ బాలికల కళాశాలలో ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న దగ్గుబాటి వైష్ణవి ఆత్మహత్యపై సిట్టింగ్ జడ్జితో సమగ్ర విచారణ జరిపించి దోషులపై చట్టపరమైన చర్యలు తీసుకుని కఠినంగా శిక్షించాలని ధర్మ స్టూడెంట్స్ యూనియన్, ధర్మ సమాజ్ పార్టీ జిల్లా నాయకులు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భువనగిరి వైష్ణవి, భవ్య, సూర్యాపేట దగ్గుపాటి వైష్ణవి, మాదాపూర్ నారాయణ ఐఐటి అకాడమీ వినయ్ విద్యార్థుల ఆత్మహత్యలకు కారకులైన అధికారులను శిక్షించాలని, విద్యార్థుల కుటుంబాలకు న్యాయం చేయాలని అన్నారు. ఇలాంటి చర్యలు పునరావృతం కాకుండా ప్రభుత్వం కఠినమైన చర్యలు తీసుకోవాలని కోరారు. దగ్గుబాటు వైష్ణవి ఆత్మహత్యపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించి ఆ కుటుంబానికి న్యాయం చేయకపోతే ధర్మ సమాజ్ పార్టీ, ధర్మ స్టూడెంట్స్ యూనియన్ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కో కన్వీనర్ సదానందం, జిల్లా అధ్యక్షురాలు సాధన, జిల్లా ప్రధాన కార్యదర్శి నరేశ్, జిల్లా నాయకులు విద్యార్థులు పాల్గొన్నారు.

మోటార్‌సైకిల్ ఢీకొని యువకుడి మృతి


ఏలిమి పవన్ (ఫైల్)

హుజూరాబాద్, ఫిబ్రవరి 13: హుజూరాబాద్‌లోని పర్కాల క్రాస్‌రోడ్ సమీపంలో బస్సు దిగి నడుచుకుంటూ వెళ్తున్న ఓ యువకుడిని సోమవారం అర్ధరాత్రి మోటార్ సైకిల్ ఢీకొట్టింది. ఎల్కతుర్తి మండలం పెంచికల్‌పేట గ్రామానికి చెందిన ఏలిమి పవన్ (24) అనే యువకుడు పర్కాల క్రాస్ రోడ్ వద్ద బస్సు దిగి నడుచుకుంటూ వెళ్తున్నాడు. ఈ క్రమంలోనే వెనుక వైపు నుంచి వరంగల్ జిల్లా వాసి మోటర్ సైకిల్‌పై వస్తూ ఢీకొట్టాడు. దీంతో పవన్‌కు తీవ్ర గాయాలు కాగా వరంగల్‌కు తీసుకెళ్లగా, పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం హైద్రాబాద్‌కు తరలిస్తుండగా మార్గ మధ్యలో మృతి చెందాడు. మృతుడి తండ్రి రవీందర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌చార్జీ టౌన్ సీఐ సంతోష్‌కుమార్ తెలిపారు.

ట్రాక్టర్ బోల్తా పడి ఇద్దరికి గాయాలు

వేములవాడ రూరల్, ఫిబ్రవరి 13: ట్రాక్టర్ బోల్తా పడి ఇద్దరు యువకులు తీవ్ర గాయాలపాలైన సంఘటన వేములవాడ మండలంలో మంగళవారం జరిగింది. స్థానికుల కథనం ప్రకారం.. ఎనుగంటి గ్రామానికి చెందిన ఏనుగుల గణేష్, నేరెళ్ల అజయ్ అనే యువకులు మంగళవారం సాయంత్రం ట్రాక్టర్ టైర్ పంచర్ చేయించుకుని ఎనుగంటి నుంచి హనుమాజీపేట వైపు వెళ్తున్నారు. మార్గమధ్యలో ట్రాక్టర్ అదుపు తప్పడంతో కల్వర్టు పైనుంచి ట్రాక్టర్ బోల్తాపడి ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు హుటాహుటిన స్థానిక ఆసుపత్రికి తరలించారు. సంఘటన స్థలాన్ని పరిశీలించిన పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు

కేంద్ర ప్రభుత్వ నిధులతోనే గ్రామాల్లో అభివృద్ధి

● బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ బండి సంజయ్

కోనరావుపేట, ఫిబ్రవరి 13: గ్రామాల్లో జరుగుతున్న అభివృద్ధి అంతా కేంద్ర ప్రభుత్వ నిధులతోనే జరుగుతున్నాయని, ప్రజల కోసం భారతీయ జనతా పార్టీ కొట్లాడితే కాంగ్రెస్‌కు ఓటేస్తారా అని దేశం అంతా ఆశ్చర్యపోతోందని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ బండి సంజయ్ అన్నారు. కోనరావుపేట మండలంలోని నాగారం, కనగర్తి, నిజామాబాద్, కోనరావుపేట, నిమ్మపల్లి, మరిమడ్ల గ్రామాల్లో మంగళవారం ప్రజాహిత యాత్రను కొనసాగించారు. ఈ సందర్భంగా ప్రతి గ్రామంలో ప్రజలు మహిళలు పాల్గొని బండి సంజయ్‌కి స్వాగతం పలికారు. నాగారంలో శివాజీ విగ్రహానికి పూలమాలవేసి ప్రజాహితయాత్ర ప్రారంభించారు. అనంతరం నాగారం, కోనరావుపేటలో ప్రసంగించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అయోధ్యలో శ్రీరాముడి గుడి కడితే దేశమంతా ప్రజలు పూజలు చేశారు. జైశ్రీరామ్ అని నినాదాలు చేస్తున్నారన్నారు. నరేంద్ర మోదీ మనకు రేషన్ బియ్యం ఉచితంగా అందిస్తే మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఒక్క రూపాయి వసూలు చేస్తున్నాడని అన్నారు. ఎలా దోపిడీ చేయాలో అనేది కుట్రలు చేస్తూనే ఉంటాడన్నారు. వేములవాడ నియోజకవర్గానికి రూ.572 కోట్ల 91 లక్షల నిధులు కేంద్ర ప్రభుత్వం ఖర్చు చేసిందన్నారు. ఉపాధి పనుల కోసం 182 కోట్ల 80 లక్షల రూపాయలు కేటాయించామన్నారు. మెటీరియల్ ఖర్చు కోసం 86 కోట్లు మొక్కల పెంపకానికి రూ. 92 కోట్లు ఖర్చు పెట్టామని అన్నారు. ఇన్ని నిధులు కేటాయిస్తే మొక్కలు ఎక్కడ కనిపించడం లేదన్నారు. కేసీఆర్ ఈ పైసలు అన్నిటినీ దారి మళ్లించాడన్నారు. ఒక్క నాగారం గ్రామానికే నాలుగు కోట్లు ఖర్చు చేశామన్నారు. బీజేపీ కార్యకర్తలను కేసీఆర్ జైల్లో పెట్టించాడని ఇదంతా ప్రజల కోసమే చేశామని అన్నారు. ఈ ఎన్నికల్లో మోదీకి ఓటు వేసి గెలిపించాలన్నారు. టీఆర్ఎస్‌కు ఓటు వేస్తే మళ్లీ మోసపోతారని అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఇంతవరకు రైతుబంధు, రుణమాఫీ వేయలేదని అన్నారు. మళ్లీ ఇప్పుడు ఎన్నికల కోడ్ వచ్చింది అని చెప్పి ఓట్లు వేయించుకుంటారని అన్నారు. అధికారులు కాళేశ్వరంపై సర్వే చేసి నివేదిక ఇచ్చినప్పటికీ కాంగ్రెస్ మంత్రులు హెలికాప్టర్‌లో కాళేశ్వరం వెళ్లొచ్చారు.. ఎందుకని ప్రశ్నించారు. కాంగ్రెస్ కృష్ణ నీటిపై, నల్గొండలో సభ పేరుతో బీఆర్ఎస్ నాటకాలు ఆడుతున్నాయన్నారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ లక్ష కోట్ల ధనాన్ని వృధా చేశానని ముక్కు నేలకు రాసి తెలంగాణ ప్రజలకు క్షమాపణ చెప్పాలని అన్నారు. పదేళ్ల పాలనలో కెసీఆర్ ఆస్తులు పెరిగాయని అన్నారు. రాష్ట్రాన్ని అప్పుల పాలు చేశారని అన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా నాయకులు గోపాడి సురేందర్‌రావు, మిరియాల్‌కార్ బాలాజీ, రేగుల మల్లికార్జున్, మాజీ జడ్పీటీసీ పల్లం అన్నపూర్ణ తదితరులు పాల్గొన్నారు.


కోనరావుపేటలో బండి సంజయ్‌ని సన్మానిస్తున్న ప్రజలు

ఏసీబీకి చిక్కిన శామీర్‌పేట తహసీల్దార్

● కరీంనగర్‌లోని ఇంటిలో సోదాలు

కరీంనగర్ క్రైం, ఫిబ్రవరి 13: శామీర్‌పేట తహసీల్దార్ తోడేటి సత్యనారాయణ మంగళవారం 10 లక్షల రూపాయలు లంచం తీసుకుంటూ అవినీతి నిరోధకశాఖ(ఏసీబీ) పోలీసులకు హైదరాబాద్‌లో పట్టుబడ్డాడు. ఈ కేసుకు సంబంధించి కరీంనగర్‌లోని విద్యానగర్ ప్రాంతంలో సత్యనారాయణకు చెందిన ఇంటిలో కరీంనగర్ ఏసీబీ డీఎస్పీ రమణమూర్తి ఆధ్వర్యంలో పోలీసులు సోదాలు నిర్వహించి కొన్ని పత్రాలు సీజ్ చేశారు. సత్యనారాయణ భార్యను ఏసీబీ అధికారులు విచారించారు.


విద్యానగర్‌లోని శామీర్‌పేట తహసీల్దార్ నివాసంలో సోదాలు చేస్తున్న ఏసీబీ అధికారులు



అంతర్జాతీయ మాస్టర్ అథ్లెటిక్స్ ఎంపిక

కరీంనగర్ స్పోర్ట్స్, ఫిబ్రవరి 13: అంతర్జాతీయ మాస్టర్ అథ్లెటిక్స్ పోటీలకు జిల్లా కేంద్రానికి చెందిన సీనియర్ మాస్టర్ అథ్లెట్ ఎ.మధుసూదన్(74) ఎంపికయ్యారు. ఈనెల 8 నుంచి 11వరకు హైదరాబాద్ గచ్చిబౌలి స్టేడియంలో జరిగిన ఐదో జాతీయ మాస్టర్ అథ్లెటిక్స్ పోటీల్లో విశేష ప్రతిభచాటి అండర్-75 విభాగంలో ఐదు కిలోమీటర్ల వాకింగ్‌లో బంగారు పతకం, 400 మీటర్ల రిలే పరుగులో రజత పతకం సాధించిన ఆయన అంతర్జాతీయ పోటీలకు ఎంపికయ్యారని మాస్టర్ అథ్లెటిక్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి నీలం లక్ష్మన్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయనను జిల్లా అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ పెరియాల రవీందర్‌రావు, సభ్యులు, వాకర్స్ జిల్లా యువజన క్రీడాశాఖ అధికారి కీర్తి రాజవీరు తదితరులు అభినందించారు.

జేఈఈ మెయిన్స్‌లో అల్ఫోర్స్‌కు ర్యాంకులు

కరీంనగర్ టౌన్, ఫిబ్రవరి 13: అల్ఫోర్స్ ఐఐటీ అకాడమీ తెలంగాణ, మహారాష్ట్ర విద్యార్థులు ఐఐటీ జేఈఈ మెయిన్స్ మొదటి విడత పరీక్ష ఫలితాల్లో సత్తా చాటారు. బి.ఆదిత్యారావు, జి.శ్రీహాస్, సుభోద్‌చౌదరి, ఎం.శ్రీరాం, ప్రణీత్, నిఖిల్‌చొప్రా, ఎ.శివవరుణ్, సిహెచ్ అనూహ్య, పి.రఘువీరరెడ్డి, సత్యఅమూల్య, షఫీక్, శివశంకరవరప్రసాద్, శ్రీనిధి, ఎం.ప్రహార్ష్, ఎం.పూనిత్ మనోహర్, రవిచంద్ర అద్భుతమైన పర్సంటైల్ సాధించారని అల్ఫోర్స్ విద్యా సంస్థల చైర్మన్ డాక్టర్ వి నరేందర్‌రెడ్డి తెలిపారు.

జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో 'ఎస్ఆర్' ప్రభంజనం


డి.మనీష్


టి.తేజస్వి

హనుమకొండ రూరల్, ఫిబ్రవరి 13 : అత్యంత ప్రతిష్ఠాత్మకమైన జేఈఈ మెయిన్స్ 2024 (సీజన్-1) ఫలితాల్లో ఎస్ఆర్ విద్యాసంస్థలకు చెందిన విద్యార్థులు ప్రభంజనం సృష్టించినట్లు ఎస్ఆర్ విద్యా సంస్థల చైర్మన్ ఎ.వరదారెడ్డి తెలిపారు. మంగళవారం విడుదలైన ఫలితాల్లో జాతీయ స్థాయిలో దొంతుల మనీష్ 99.99 శాతం పర్సంటైల్ సాధించి ఎస్ఆర్ విద్యాసంస్థల కీర్తి ప్రతిష్ఠలను జాతీయస్థాయిలో నిలబెట్టినట్లు తెలిపారు. అలాగే తుమ్మ తేజస్వీ 99.95 శాతం, ఆర్.దీపాన్ష్‌రెడ్డి 99.19 శాతం, పి.నిహిల్ శ్రీవాత్సవ్ 99.91 శాతం సాధించినట్లు తెలిపారు. భవిష్యత్‌లో అత్యుత్తమైన ర్యాంకులు సాధించేలా విద్యార్థులను తీర్చిదిద్దుతామన్నారు. ఈ సందర్భంగా ర్యాంకులు సాధించిన విద్యార్థులను వరదారెడ్డి అభినందించారు.

ప్రతిభ చాటిన అలుగునూర్ ఎస్ఆర్ కళాశాల విద్యార్థులు

తిమ్మాపూర్: జేఈఈ మెయిన్ ఫలితాల్లో కరీంనగర్ పరిధిలోని అలుగునూర్‌లో గల ఎస్ఆర్ జూనియర్ కళాశాలకు చెందిన 9 మంది విద్యార్థులు 90 పర్సంటైల్ సాధించి జాతీయ స్థాయిలో సత్తా చాటారని ఎస్ఆర్ విద్యా సంస్థల జోనల్ ఇంచార్జ్ నేదూరి తిరుపతి తెలిపారు. మంగళవారం కళాశాల ప్రాంగణంలో ఆయన విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. కళాశాలకు చెందిన జి.రాజీవ్(99.2) పర్సంటైల్‌తో అత్యున్నత ప్రతిభ కనబరచగా, జి.శ్రీవాత్సవ్(98.5), ఎస్.వినూత్న(98.22), బి.రిషిత్(98), బి.క్షేత్ర(96.5), డి.రోహన్(96), ఏ.ఆశ్విక్(94.09),కె.ఒమేశ్వర్(92.21), వి.శ్రీహరిణి(90) పర్సెంటైల్ సాధించినట్లు తెలిపారు. విద్యార్థులను ఎస్ఆర్ విద్యా సంస్థల చైర్మన్ వరదారెడ్డి, డైరెక్టర్లు మధుకర్‌రెడ్డి, సంతోష్‌రెడ్డి, ప్రిన్సిపాల్స్ నాగార్జునరెడ్డి, ప్రవీణ్‌రెడ్డి, మారుతి, శ్రీనివాస్‌రెడ్డి అధ్యాపకులు అభినందించారు.


కరీంనగర్‌లో విద్యార్థులను అభినందిస్తున్న ఎస్ఆర్ జోనల్ ఇన్‌చార్జి నేదూరి తిరుపతి

జేఈఈ మెయిన్స్‌లో ట్రినిటి ప్రతిభ


వర్షితరాణి


శ్రీతేజ

కరీంనగర్ టౌన్, ఫిబ్రవరి 12: జేఈఈ మెయిన్స్ సెషన్-1 ఫలితాల్లో ట్రినిటి కళాశాల విద్యార్థులు విజయ దుందుభి మోగించారు. కళాశాల ఆవరణలో మంగళవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ట్రినిటి విద్యాసంస్థల ఫౌండర్ అండ్ చైర్మన్ దాసరి మనోహర్‌రెడ్డి, చైర్మన్ ప్రశాంత్‌రెడ్డి విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రణాళికతో, అకుంఠిత దీక్షతో ఉత్తమ ఫలితాలు సాధించామన్నారు. ఫలితాల్లో వర్షితరాణి 99.53 పర్సంటైల్, వి.శ్రీతేజ 98.49 పర్సంటైల్, ఎం.మణితేజ 97.75 పర్సంటైల్ సాధించారన్నారు. మరెన్నో ఉత్తమమైన ఆమోదయోగ్యమైన ఫలితాలు సాధించామన్నారు. ఒత్తిడి లేని విద్యా విధానంతో చక్కని ప్రణాళికతో విద్యను అందిస్తున్నామన్నారు.

ప్రజాస్వామ్య ప్రక్రియను నిలబెట్టడమే కాంగ్రెస్ లక్ష్యం

● ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి

జగిత్యాల టౌన్, ఫిబ్రవరి 13: ప్రజాస్వామ్య ప్రక్రియను నిలబెట్టడమే కాంగ్రెస్ పార్టీ ప్రధాన లక్ష్యమని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి అన్నారు. జగిత్యాల జిల్లా కేంద్రంలోని ఇందిరాభవన్‌లో మంగళవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. స్థానిక సంస్థల్లో సామాజికంగా మహిళలకు ప్రాధాన్యత కల్పించాలని ఆనాడు స్వర్గీయ రాజీవ్ గాంధీ ఆధ్వర్యంలో 73, 74 రాజ్యాంగ సవరణ ద్వారా మూడవ వంతు రిజర్వేషన్ కల్పించారన్నారు. స్థానిక సంస్థల్లో ఏ పదవి ఖాళీ అయినా దానిని ఆరు నెలల్లో ఎన్నిక ద్వారా భర్తీ చేయాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వానికి ఉంటుందన్నారు. కానీ జగిత్యాలలో మాత్రం ఇవేమీ పాటించకుండా బీఆర్ఎస్ ప్రభుత్వం కాలం గడిపిందన్నారు. జగిత్యాల రూరల్ ఎంపీపీ కరోనాతో మృతి చెందగా, జగిత్యాల బల్దియా చైర్‌పర్సన్ బోగ శ్రావణి తన పదవితో పాటు కౌన్సిలర్ పదవికి రాజీనామా చేయడంతో పదవులు ఖాళీ అయినా ఆ స్థానాలకు ఎన్నిక నిర్వహించకపోవడంతో మహిళలకు కేటాయించిన రిజర్వేషన్ హక్కులు కోల్పోతున్నారన్నారు. బీసీలకు కేటాయించిన సీట్లలో ఉన్నత వర్గాలకు చెందిన వారు కొనసాగుతుండడంతో బీసీలు తమ హక్కులను కోల్పోతున్నారన్నారు. పీసీసీ సభ్యుడు గిరి నాగభూషణం, బండ శంకర్ ఉన్నారు.

ఖాతాదారుల డబ్బులు కాజేస్తున్న సైబర్ మోసగాళ్లు

● ధర్మారం మండలంలో వరుస ఘటనలు
● తాజాగా రూ.29,500 డ్రా

ధర్మారం,ఫిబ్రవరి13: సైబర్ నేరగాళ్లు బ్యాంకు ఖాతాదారులపై కన్నేశారు. బ్యాంకులో డబ్బులున్నాయని అవసరానికి తీసుకుందామని వెళ్తే ఖాతా ఖాళీకావడంతో అవాక్కవుతున్నారు. తమకు తెలియకుండా డబ్బులు డ్రా చేశారని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పెద్దపల్లి జిల్లాలోని ధర్మారం మండలం నందిమేడారంలో నందినేని పవన్‌కుమార్ ఎస్‌బీఐ ఖాతాలో నుంచి అతనికి తెలియకుండానే రూ. 10వేలు డ్రా కావడంతో పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశారు. తాజాగా మంగళవారం మరో మోసం కేసు నమోదైంది. ధర్మారం మండలంలోని బొట్లవనపర్తి గ్రామానికి చెందిన దారవేని పోచాలు ఎస్‌బీఐ ఖాతా నుంచి మూడు విడతలుగా ఏఈపీఎస్(ఆధార్ ఎనేబుల్డ్ మెమెంట్) ద్వారా రూ.29వేల 500లను సైబర్ నేరగాళ్లు డ్రా చేసినట్టు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. తన ఖాతా నుంచి తనకు తెలియకుండా గత ఏడాది డిసెంబరు31న రూ.10వేలు, ఈ ఏడాది జనవరి 2న రూ. 9వేల 500, జనవరి 4న రూ.10వేలు మొత్తం రూ. 29వేల 500 డ్రా జరిగినట్టు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో వివరించాడు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్సై సత్యనారాయణ తెలిపారు.

విచారణ చేస్తున్న పోలీసులు

ధర్మారం మండలంలో ఇద్దరి ఎస్‌బీఐ ఖాతాలో నుంచి రూ.39వేలను వేర్వేరు తేదీలలో సైబర్ నేరగాళ్లు డ్రా చేయడంతో పోలీసులు విచారణ చేస్తున్నారు. ఒక వైపు సైబర్ నేరాలను అరికట్టేందుకు పోలీసులు ప్రజలకు అవగాహన కల్పిస్తున్నా ప్రజలు ఎక్కడో ఒకచోట మోసపోతూనే ఉన్నారు. సైబర్ నేరగాళ్లు పోలీసులకు సవాలు విసురుతున్నారు. ఇటీవల ఎక్కువగా భూముల రిజిస్ట్రేషన్ చేసే సమయంలో వేలిముద్రలను ఉపయోగిస్తుండడంతో ఆ కోణంలో పోలీసులు విచారణ చేస్తున్నారు. అంతే కాకుండా కంప్యూటర్ సెంటర్‌లలో కూడా ఎవరైనా ఈ నేరాలకు పాల్పడుతున్నారా? అనే కోణంపై పోలీసులు దృష్టి సారించారు. బ్యాంకు ఖాతాల్లో భద్రంగా డబ్బులుంటాయని నమ్మకం లేకుండా సైబర్ నేరగాళ్లు చేస్తున్న మోసాలకు బ్యాంకు ఖాతాదారులు భయాందోళన చెందుతున్నారు. మోసాలపై పోలీసులు విచారణ వేగవంతం చేశారు.

రైతుబంధు పేరుతో మోసం

కొడిమ్యాల, ఫిబ్రవరి 13: మండలంలోని నాచుపల్లిలో సోమవారం జరిగిన ఆన్‌లైన్ మోసంలో ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురి ఖాతా నుంచి రూ.1.25 లక్షలు మోస పోయారు. బాధితులు తెలిపిన వివరాల మేరకు నాచు పల్లి గ్రామానికి చెందిన గాజర్ల సౌమ్యకు రైతు బంధు డబ్బులు 21 వేలు మంజూరయ్యాని గుర్తు తెలియని వ్యక్తి ఫోన్ చేసి బ్యాంక్ వివరాలు కోరాడు. వివరాలు అందు బాటులో లేకపోవటంతో ఇంటి పక్కనే ఉన్న సంధ్య అనే మహిళ బ్యాంక్ వివరాలను సదరు వ్యక్తికి తెలిపింది. బ్యాంక్ ఖాతాకు పూర్తి వివరాలు సరిపోవటం లేదని మళ్లీ ఫోన్ రావటంతో సంధ్య కుటుంబ సభ్యులైన సుమన్, రమేష్‌కు చెందిన బ్యాంక్ వివరాలు తెలిపారు. కొద్ది సేపటికి ముగ్గురి ఖాతాలో నుంచి రూ.1,25,408 రూపాయలు కట్ అయ్యాయి. మోసపోయినట్లు గుర్తించిన బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

విద్యుత్ కంచె అమర్చిన వ్యక్తి రిమాండ్

రుద్రంగి, ఫిబ్రవరి 13: అటవీ జంతువుల వేట కోసం విద్యుత్ తీగలు అమర్చిన గుగులోతు తిరుపతిని రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై అశోక్ తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. రుద్రంగి మండలం రూప్లా నాయక్ తండా శివారులోని గుగులోతు తిరుపతి పంటకు విద్యుత్ కంచె ఏర్పాటు చేశాడు. దీంతో హరిసింగ్ అనే రైతుకు చెందిన గేదె కంచెకు తగలడంతో విద్యుత్ షాక్ గురై అక్కడికక్కడే మృతి చెందింది. హరిదాస్ ఫిర్యాదుతో తిరుపతిపై ఆదివారం కేసు నమోదు చేశారు. విచారణ అనంతరం మంగళవారం తిరుపతిని రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై తెలిపారు. ఎవరైనా పొలాలకు విద్యుత్ కంచెలను అమరిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

బోయినపల్లి, ఫిబ్రవరి 13: రోడ్డు ప్రమాదంలో గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బోయినపల్లి మండలం వరదవెల్లి గ్రామానికి చెందిన రాజనర్సు (60) మంగళవారం పరిస్థితి విషమించి మృతి చెందాడు. గ్రామానికి చెందిన రాజనర్సు (60), శివయ్య, అనంత రెడ్డి ఈ నెల 8న కూలి పని కోసం వరదవెల్లి వచ్చారు. రోడ్డు పక్కన ముగ్గురు మాట్లాడుకుంటుండగా పెగడపల్లి మండలం బత్కపల్లికి చెందిన మారుతి కారు అతివేగంగా వచ్చి ముగ్గురిని ఢీకొట్టింది. ముగ్గురికి గాయాలు కాగా రాజనర్సు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

విద్యుదాఘాతంతో గేదె మృతి

పెగడపల్లి, ఫిబ్రవరి 13: పెగడపల్లి మండలంలోని లింగాపూర్ గ్రామానికి చెందిన పొన్నం లచ్చయ్యకు చెందిన గేదె మంగళవారం విద్యుదాఘాతంతో మృత్యువాత పడింది. ఇంటి ముందు స్తంభానికి కట్టివేసిన గేదెపై ప్రమాదవశాత్తు విద్యుత్ వైరు తెగిపడి మృతి చెందినట్లు గ్రామస్థులు, బాధిత రైతు తెలిపారు. రూ.50 వేలు విలువ చేసే గేదె మృత్యువాత పడటంతో బాధిత రైతు కన్నీరు మున్నీరుగా విలపించారు. రైతుకు ప్రభుత్వం విద్యుత్ శాఖ పరిహారం అందించి ఆదుకోవాలని ఎంపీటీసీ పూసాల శోభాతిరుపతి, రైతులు కోరారు.



పిల్లలు పుట్టడం లేదని ఆత్మహత్య


సల్లె రమేష్(ఫైల్)

సుల్తానాబాద్, ఫిబ్రవరి 13: వివాహం జరిగి ఎనిమిది సంవత్సరాలు కావస్తున్నా పిల్లలు పుట్టడం లేదని మనస్తాపం చెందిన ఓ యువకుడు రైల్వేట్రాక్ పక్కనున్న ట్రాన్స్‌ఫార్మర్‌ను ముట్టుకుని మంగళవారం ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్సై వినీత తెలిపారు. సుల్తానాబాద్‌కు చెందిన సల్లె రమేష్ (33)కు స్రవంతితో వివాహం జరిగి ఎనిమిది సంవత్సరాలు అవుతోంది. అయితే వీరికి సంతానం లేకపోవడంతో మనస్తాపం చెందిన రమేష్ మద్యంకు బానిసగా మారాడు. ఇంట్లో తల్లి, అతని భార్య తాగుడు వద్దని చెప్పినా పెడచెవిన పెట్టేవాడు. మంగళవారం ఉదయం ఇంట్లో నుంచి వెళ్లిన రమేష్ మద్యం తాగి ఇంటికి రాగా తల్లి సమ్మక్క మందలించడంతో ఇంటి వెనకాల రైల్వే ట్రాక్ పక్కనున్న ట్రాన్స్‌ఫార్మర్‌ను పట్టుకుని ఆత్మహత్య చేసుకున్నాడని ఎస్ఐ వివరించారు. మృతునికి భార్య స్రవంతి, తల్లి సమ్మక్క ఉన్నారు. తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సుల్తానాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు పోలీసులు తెలిపారు.

ఆర్థిక ఇబ్బందులతో..

వెల్గటూర్, ఫిబ్రవరి 13: ఆర్థిక ఇబ్బందులు తాళలేక తాళ్లకొత్తపేట గ్రామా నికి చెందిన ఎల్కటూరి లక్ష్మీనారాయణ (35) అనే వ్యక్తి సోమవారం రాత్రి ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్సై ఉమాసాగర్ తెలిపిన వివరాల ప్రకారం మృతుడు లక్ష్మీనారాయణ గత కొద్ది రోజులుగా ఆర్థిక ఇబ్బందులతో బాధపడు తున్నాడు. ఈ క్రమంలో సోమవారం రాత్రి ఇంటిలో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతునికి భార్య సౌందర్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. మృతుని భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

చిన్నకల్వలలో యువకుడు..


సుధీర్‌రావు (ఫైల్)

సుల్తానాబాద్, ఫిబ్రవరి 13: సుల్తానాబాద్ మండలంలోని చిన్నకల్వల గ్రామంలో గౌరవెల్లి సుధీర్‌రావు (30) అనే యువకుడు మంగళవారం ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు.ఇంట్లో ఎవరూ లేని సమయంలో సుధీర్‌రావు మంగళవారం ఉదయం ఉరి వేసుకోవడంతో సాయంత్రం సంఘటన వెలుగు చూసింది. భార్య అవని కొన్నిరోజుల క్రితం అమె పుట్టింటికి వెళ్లింది. తల్లి స్వర్ణ అలియాస్ పద్మ సుగ్లాంపల్లిలో అంగన్ వాడీ టీచర్‌గా పనిచేస్తోంది. దీంతో ఇంట్లో ఎవరూ లేని సమయంలో సుధీర్‌రావు ఆత్మహత్యకు పాల్పడ్డారు. వివరాలు తెలియాల్సి ఉంది. మృతునికి భార్య, కుమారుడు ఉన్నారు.

పోలీస్ భద్రతా చెక్కు అందజేత



భద్రతా చెక్కు అందజేస్తున్న ఎస్పీ

జగిత్యాల టౌన్, ఫిబ్రవరి 13 : వెల్గటూర్ పోలీస్ స్టేషన్‌లో ఏఎస్ఐగా పని చేస్తున్న రాజమల్లయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. పోలీస్ భద్రతా పథకం కింద రూ. 7.36 లక్షల చెక్కు మంజూరు కాగా మంగళవారం పోలీస్ ప్రధాన కార్యాలయంలో బాధిత కుంటుంబానికి ఎస్పీ సన్ ప్రీత్ సింగ్ చేతుల మీదుగా అందజేశారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ మృతుని కుంటుంబానికి పోలీస్ శాఖ అండగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఏవో అమర్నాథ్ ఉన్నారు.

గంజాయి నిర్మూలనకు సహకరించాలి

గొల్లపల్లి, ఫిబ్రవరి 13: మండలంలో గంజాయి నిర్మూలనకు పత్రికా మిత్రులు సహకరించాలని ఎస్సై చిర్ర సతీష్ కోరారు. మంగళవారం నూతనంగా బాధ్యతలు చేపట్టిన సతీష్‌ను గొల్లపల్లి ప్రెస్‌క్లబ్ సభ్యులు కలిశారు. ఈ సందర్భంగా ఎస్సైకి బొకే అందించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఎస్సై మాట్లాడుతూ మండలంలో శాంతి భద్రతల పరిరక్షణకు పూర్తి స్థాయి సహకారం అందించాలని, గంజాయిని పూర్తిగా నిర్మూలించేందుకు పత్రికా మిత్రులతో పాటు మండల ప్రజలు సహకరించాలని కోరారు. శాంతి భద్రతల పరిరక్షణకు విఘాతం కలిగిస్తే ఎంతటివారైనా ఉపేక్షించేది లేదని పేర్కొన్నారు. గొల్లపల్లి తహసీల్దార్‌గా బాధ్యతలు చేపట్టిన మహ్మద్ జమీర్‌ను ప్రెస్‌క్లబ్ సభ్యులు కలిశారు. తహసీల్దార్‌కు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బొల్లె రాజన్న, కరుణాకర్‌రెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు కట్ట శ్రీనివాస్, ప్రెస్‌క్లబ్ గౌరవ అధ్యక్షుడు వేణు పాల్గొన్నారు.

విద్యారంగంపై రాష్ట్ర ప్రభుత్వం చిన్నచూపు

ఏబీవీపీ నగర కార్యదర్శి కాసిపాక అరవింద్

మెట్‌పల్లి, ఫిబ్రవరి, 13 : రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌లో విద్యారంగం, యూనివర్సిటీలకు అభివృద్ధికి సరిపోయే నిధులను కేటాయించకుండా చిన్నచూపు చూపిందని అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ మెట్‌పల్లి నగర శాఖ ప్రధాన కార్యదర్శి కాసిపాక అరవింద్ అన్నారు. మంగళవారం పట్టణంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తరువాత విద్యారంగానికి 15 శాతం బడ్జెట్‌ను కేటాయిస్తామని హామీ ఇచ్చిందని, కానీ 7.75 శాతం కేటాయించడంతో విద్యారంగం నిర్వీర్యమయ్యే ప్రమాదం ఉందన్నారు. ప్రభుత్వం పునరాలోచించి బడ్జెట్‌లో 30 శాతం నిధులను కేటాయించాలని డిమాండ్ చేశారు. లేనియెడల విద్యారంగం తరుపున ఏబీవీపీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఉద్యమం చేపడుతుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సంయుక్త కార్యదర్శి అభివెంకట్, కార్యవర్గ సభ్యుడు వడకపురం సాయిరామ్ పాల్గొన్నారు.

'అర్హులకు గృహజ్యోతి అందేలా చూడాలి'



కోనరావుపేటలో లబ్ధిదారులను నుంచి వివరాలను సేకరిస్తున్న అధికారులు

మెట్‌పల్లి రూరల్, ఫిబ్రవరి, 13 : రాష్ట్ర ప్రభుత్వం అందజేస్తున్న గృహజ్యోతి పథకం అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా చూడాలని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు జక్కని పరందాములు అధికారులను కోరారు. మంగళవారం మండలంలోని కోనరావుపేట గ్రామంలోని ఆరు గ్యారెంటీల్లో దరఖాస్తులు చేసుకున్న వారిని నుంచి అధికారుల వివరాలను సేకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లోని వారు తప్పుగా దరఖాస్తులు చేసుకున్న వారి వివరాలు సేకరించి అర్హులైన వారికి గృహజ్యోతిలో భాగంగా ప్రభుత్వం అందేజేసే ఉచిత విద్యుత్ పథకం అందేలా అధికారుల సర్వేను చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రాజుకుమార్, విద్యుత్ అధికారులు మారుతి, దేవేందర్, నాయకులు పాల్గొన్నారు.

ప్రతిభ చాటిన ఆదర్శ పాఠశాల విద్యార్థులు

గొల్లపల్లి, ఫిబ్రవరి 13: గొల్లపల్లి మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలోని విద్యార్థులు జిల్లా స్థాయి ఆంగ్ల ఉపాధ్యాయుల సంఘం(ఎల్టా) ఆధ్వర్యంలో నిర్వహించిన డ్రీమ్ టు స్పెల్ విజార్డ్, డ్రామా పోటీల్లో ప్రతిభ కనబరిచి ద్వితీయ స్థానం సాధించారు. స్పెల్ విజార్డ్‌లో ఎ. వర్షిణి, డ్రామా పోటీలో ఎస్.సేజల్, అనిశ్విక్, సాయి సమృద్, సుప్రీత్, నేహశ్రీ బృందం గెలుపొందారు. ఆపిల్ ఆఫ్ పేరెంట్స్ ఐ అనే ఆంగ్ల నాటికకు ఈ బహుమతి లభించింది. ఈ నాటికను పాఠశాల ఆంగ్ల ఉపాధ్యాయుడు జివి రమణ రచించి మార్గదర్శకత్వం వహించారు. ఎల్టా అధ్యక్షుడు రాజశేఖర్, ప్రధాన కార్యదర్శి ధరందీప్‌ల చేతులమీదుగా విద్యార్థులు బహుమతి, ప్రశంసా పత్రాలు అందుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులను పాఠశాల ప్రిన్సిపాల్ ఈరవేణి రాజ్ కుమార్, వైస్ ప్రిన్సిపాల్ కె.నగేష్, ఉపాధ్యాయులు రాకేష్, ప్రవీణ్, అన్నపూర్ణ తదితరులు అభినందించారు.

అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలి

మల్లాపూర్, ఫిబ్రవరి, 13 : గ్రామాల్లో అనుమానాస్పదంగా కనబడిన వ్యక్తులపై పోలీసులకు సమాచారం అందజేయాలని హెడ్‌కానిస్టేబుల్ అశోక్ అన్నారు. సామాజిక అంశాలపై ఎస్పీ సన్ ప్రీత్‌సింగ్ ఆదేశాల మేరకు పోలీసు కళ బృందం మంగళవారం మండలంలోని కుస్తాపూర్, రత్నాపూర్ గ్రామాల్లో అవగాహన కల్పించారు. మూఢ నమ్మకాలు, ఆత్మహత్యల నివారణ, రోడ్డు ప్రమాదాలు, ట్రాఫిక్ నియమాలు, గల్ఫ్ ఏజెంట్‌ల మోసాల నివారణ, సీసీ కెమెరాల ఆవశ్యకతపై ప్రజలకు అవగాహన కల్పించారు. యువత చెడు వ్యసనాలకు అలవాటు పడి జీవితాలను నాశం చేసుకోవద్దని, గ్రామాల్లో ఎమైనా సమస్యలు ఉంటే 100నంబర్‌కు ఫోన్ చేస్తే వెంటనే పోలీసలు తమ వద్దకు వస్తారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది, కళా బృందం, నాయకులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి పోటీలకు ఎంపిక

మెట్‌పల్లి రూరల్, ఫిబ్రవరి, 13 : జాతీయ స్థాయి కవిత్వపు పోటీలకు మండలంలోని ఆత్మకూర్ గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలకు చెందిన ధనిక్ అనే విద్యార్థి ఎంపికై నట్లు ప్రధానోపాధ్యాయుడు జగన్‌మోహన్‌రావు తెలిపారు. మంగళవారం పాఠశాలల్లో విద్యార్థిని ఉపాధ్యాయులు మెమెంటోను అందజేసి అభినందించారు. ప్రపంచ సైన్స్ దినోత్సవం సందర్భంగా జిల్లా స్థాయిలో నీరు సంరక్షణ అనే అంశంపై కవిత్వపు పోటీలను నిర్వహించగా ప్రతిభ కనబరిచాడన్నారు. దీంతో ఈనెల 28న హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో నిర్వహించే జాతీయర స్థాయి పోటీలకు విద్యార్థి ధనిక్ ఎంపికైనట్లు తెలిపారు. ధనిక్‌ను ఉపాధ్యాయులు, తోటి విద్యార్థులు అభినందిం చారు.

కార్మికులకు అండగా యూనియన్ ఉంటుంది

మెట్‌పల్లి పెయింటర్స్ యూనియన్ అధ్యక్షుడు ఏశవేని గణేష్

మెట్‌పల్లి, ఫిబ్రవరి, 13 : కార్మికులకు అండగా యూనియన్ ఉంటుందని మెట్‌పల్లి పెయింటర్స్ యూనియన్ అధ్యక్షుడు ఏశవేని గణేష్ అన్నారు. పట్టణంలోని యూనియన్‌కు చెందిన నక్క కళ్యాణ్ ఇటీవల ప్రమాదవశాత్తు మృతి చెందడంతో ఆయన కుటుంబ సభ్యులకు రూ. 15వేల ఆర్థిక సహాయం అందజేశారు. అదేవిధంగా పనులు చేస్తుండగా గాయపడిన షేక్ సోను, ఎర్ర అనిల్, నక్క అజయ్, చిట్యాల శ్యామ్‌లకు ఒక్కక్కరికి రూ. 2 వేల చొప్పున స్థానిక నాయకులతో కలిసి అందజేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ ఉపాధ్యక్షులు పొన్నాల ఎల్లేష్, చౌదరి శివకుమార్, కోశాధికారి మాతంగి శ్రావణ్, రైటర్ అంకమల్ల మహేష్, క్రిష్ణగౌడ్, సోరుపాక శ్రావణ్, సుంచు రాజు, బజరంగ్, శ్యామ్, అనిల్, రాజశేఖర్, శ్రీనివాస్, రమేష్, పాల్గొన్నారు.

పల్లె వైద్యంతో ప్రజలకు భరోసా

●గ్రామీణ వైద్యానికి జాతీయ గుర్తింపు
●మౌలిక వసతుల కల్పనకు యేటా రూ.1.50 లక్షల నిధులు మంజూరు



కట్కాపూర్ పల్లె దవాఖానా

రాయికల్, ఫిబ్రవరి 13: ప్రభుత్వం ప్రవేశపెడుతున్న పథకాలు, వైద్య సిబ్బంది సమష్టి కృషితో పల్లె వైద్యం పట్ల ప్రజలకు భరోసా కలుగుతోంది. రాయికల్ మండలంలోని మారుమూల అటవీ గ్రామమైన కట్కాపూర్ పల్లె దవాఖానాకు జాతీయ గుర్తింపు లభించింది. రాష్ట్ర స్థాయిలో ఏడు రకాల అంశాలలో ప్రమాణాలను పాటించి, ప్రజలకు వైద్య సేవలు అం దించడంతో 83 శాతం మార్కులు పొంది మొదటి స్థానాన్ని కైవసం చేసుకుంది. జనవరిలో పల్లె దవాఖానాలో అందుతున్న ఏడు విభాగాల సేవలను జాతీయ నాణ్యత ప్రమాణాల బృందం పరిశీలించి, రికార్డులను తనిఖీ చేసింది. పలు విభాగాలు మార్కులు కేటాయించి జాతీయ నాణ్యత ప్రమాణాల గుర్తింపు ధృవీకరణ పత్రం అందజేసింది. ఈ గుర్తింపు ద్వారా పల్లె దవాఖానా అభివృద్ధికి యేటా రూ.1.50 లక్షల ప్రోత్సాహక నిధులు అందనున్నాయి.

●పల్లె దవాఖానాల్లో ప్రజల బారులు

ఓ పక్క ప్రభుత్వ పథకాలు, మరోపక్క వైద్య సిబ్బంది సమష్టి కృషితో పల్లె దవాఖానాలు ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నాయి. నాడు నేను రాను బిడ్డో సర్కారు దవాఖానాకు అన్న నానుడిని చెరిపి వేస్తూ, నేడు పల్లె దవాఖానా ముద్దు.. పోదాం పదా బిడ్డ అంటూ పల్లె ప్రజలు ప్రభుత్వ వైద్యం కోసం పల్లె దవాఖానాల్లో బారులు తీరుతున్నారు. జిల్లాలో ఐదేళ్ల నుంచి 18 పల్లె దవాఖానాలు జాతీయ స్థాయి గుర్తింపు పొంది మౌలిక వసతుల కల్పన కోం నిధులు కేటాయించబడి పల్లె ప్రజలకు వైద్య సేవలు అందిస్తున్నాయి. జగిత్యాల పట్టణ ఆస్పత్రితో పాటు రాయికల్, మల్లాపూర్, ఇబ్రహీంపట్నం, కథలాపూర్, కొడిమ్యాల, మేడి పల్లి, పెగడపల్లి తదితర మండలాల్లోని 18 పల్లె దవాఖానాలు జాతీయ గుర్తింపు పొందాయి. గ్రామీణ పల్లె దవాఖానాలు జాతీయ స్థాయిలో గుర్తింపు పొందాలంటే ఏడు నుంచి ఎనిమిది రకాల అంశాలలో విశిష్ట సేవలు అందించాలి.

●నిపుణుల కమిటీతో జాతీయ గుర్తింపు

మండలంలోని కట్కాపూర్ పల్లె దవాఖానాకు జాతీయ స్థాయిలో గుర్తింపు లభించింది. జనన, మరణాల రేటు తగ్గింపు, నవజాత శిశువుల సంరక్షణ, పిల్లలకు మెరుగైన వైద్య సేవలు, కుటుంబ నియంత్రణ, కమ్యూనికల్ రోగాల తగ్గింపు, మందులు, రక్త పరీక్షల సేవలను పరిగణలోకి తీసుకుని నిపుణుల కమిటీ జాతీయ స్థాయిలో గుర్తింపు కల్పిస్తుంది. అలాగే పల్లె దవాఖానాలు పారిశుధ్య పరిశుభ్రత పాటించడం, ప్రజలకు ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు అందించే సేవలు, వైద్యుల వైద్య సేవలు, రోగుల హక్కులు కాపాడటం, ప్రజలకు అన్ని రకాల వసతులు కల్పించడం వంటి అంశాలను పరిగణలోకి తీసుకుని మౌలిక వసతుల కల్పన కోసం యేటా రూ.1.50 లక్షలను ప్రభుత్వం మంజూరు చేస్తుంది. దీంతో గ్రామీణ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందుతున్నాయి.



సిబ్బందికి అవగాహన కల్పిస్తున్న జాతీయ బృందం(ఫైల్)

●సమష్టి కృషితోనే గుర్తింపు

శ్రీనివాస్, జిల్లా ఉప వైద్యాధికారి



గ్రామీణ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడంలో స్థానిక ప్రజాప్రతినిధుల సహకారంతో పాటు జిల్లా వైద్యాధికారులు, పల్లె దవాఖానాల వైద్య సిబ్బంది సమష్టి కృషి ఎంతో ఉంది. జిల్లాలో 18 పల్లె దవాఖానాలు ఎంపిక కాగా, మరికొన్ని మం డలాల్లోని పల్లె దవాఖానాల్లో సైతం జాతీయ గుర్తింపు పొందేందుకు వైద్య సిబ్బందికి శిక్షణ తరగతులు నిర్వహిస్తూ ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం. రాష్ట్ర స్థాయిలో జగిత్యాల జిల్లాను మొదటి స్థానంలో నిలిపేందుకు జిల్లా అధికారులు గ్రామీణ వైద్య సిబ్బందితో కలిసి సమిష్టి కృషి చేస్తున్నాం.

అయోధ్య తరలిన బీజేపీ శ్రేణులు

కోరుట్ల రూరల్, ఫిబ్రవరి 13 : మండలంలోని వివిధ గ్రామాల నుంచి మంగళవారం బీజేపీ నాయకులు రామమందిర దర్శనార్థం అయోధ్య తరలివెళ్లారు. ఎంపీ అరవింద్ ఏర్పాటు చేసిన రైలులో జైశ్రీరాం నినాదాలు చేస్తూ వెళ్లారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షుడు పంచరి విజయ్, మాజీ సర్పంచులు తుకారాం గౌడ్, లింగారెడ్డి, సుదర్శన్, మల్లారెడ్డి, విజయ్ ఉన్నారు.

మెట్‌పల్లి రూరల్: అయోధ్యలోని బాల రాముడిని దర్శించుకోవడానికి మండలంలోని బీజేపీ శ్రేణులు బయలు దేరారు. మంగళవారం మండలంలోని జగ్గసాగర్ గ్రామం నుంచి బీజేపీ మండలాధ్యక్షుడు కొమ్ముల రాజ్‌పాల్‌రెడ్డి ఆధ్వర్యంలో నాయకులు బాల రాముడి దర్శనానికి అయోధ్యకు బయలు దేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోట్లాది భారతీయుల ఆకాంక్షల ప్రతిరూపమైన అయోధ్య రామమందిరం దర్శనానికి నిజామా బాద్ నుంచి రైల్వేల్లో అయోధ్యకు బయలు దేరినట్లు తెలిపారు. 500 ఏళ్ల నిరీక్షణకు తెరలేపి మార్చిలో ప్రధాన మంత్రి నరేంద్రమోదీ నేతృత్వంలో అయోధ్యలో బాలరాముడి విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని నిర్వహించిన విషయం అందరికి తెలిసందేనని అన్నారు.



రైలులో అయోధ్యకు బయలు దేరుతున్న బీజేపీ నాయకులు

ప్రతి ఒక్క హిందు ఆదర్శంగా కొ లిచే రాముడి జీవితాన్ని ఆదర్శంగా తీసుకొని ముందుకెళ్లాలన్నారు. అయోధ్యకు బయలు దేరిన వారిలో బీజేపీ కిసాన్‌మోర్చా మండలాధ్యక్షుడు మారు జనార్దన్‌రెడ్డి, బీసీ మండలాధ్యక్షుడు బోగ గంగాధర్, మేడిచెల్మెల రవి, నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

ఘనంగా వసంత పంచమి వేడుకలు

రాయికల్, ఫిబ్రవరి 13: రాయికల్ మండలంలోని ఇటిక్యాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ముందస్తు వసంత పంచమి వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. పాఠశాలలో నెలకొల్పిన సరస్వతీ దేవి విగ్రహం వద్ద ప్రత్యేక పూజలు చేశారు. 10వ తరగతి విద్యార్థులకు పెన్నులను అందజేశారు. విద్యార్థులు క్రమశి క్షణతో చదివి మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించాలని ఉపాధ్యాయులు సూచించారు. ప్రధానోపాధ్యాయులు ఎస్.సదాశివ్, ఉపాధ్యాయులు గాజెంగి రాజేశం, చెరుకు మ హేశ్వర శర్మ, ఎద్దండి రమేష్, శాంత కుమారి, జియా వొద్దీన్, పి.హన్మంతరావు, వి.సంపత్ కుమార్, వి.కిషోర్ పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధికి సహకరించాలి

మెట్‌పల్లి రూరల్, ఫిబ్రవరి, 13 : మండలంలోని ఆత్మకూర్ గ్రామాభివృద్ధికి అధికారులు సహకరించాలని కాంగ్రెస్ ఎస్సీ సెల్ మండలాధ్యక్షుడు నేరెళ్ల శ్రీనివాస్ అన్నారు. గ్రామంలో సర్పంచు పదవి కాలం ముగియడంతో ప్రభుత్వం పాలన కోసం ఏర్పాటు చేసిన ప్రత్యేక అధికారి సంకీత్‌ను మంగళవారం గ్రామపంచాయతీ కార్యాలయంలో శాలువతో సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమం, అభివృద్ధి కోసం కృషి చేయాలన్నారు. గ్రామంలో అర్హులైన ప్రజలకు ప్రభుత్వం ఆరు గ్యారేంటీల్లో భాగంగా అందజేస్తున్న సంక్షేమ పథకాలు ప్రతి ఒక్కరికి అందేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు బాలరాజు, శేఖర్, లక్ష్మీనారాయణ, సుమన్, నరేష్, నవీన్ పాల్గొన్నారు.

పాఠశాలకు విరాళం

జగిత్యాలరూరల్, ఫిబ్రవరి 13 :జగిత్యాల రూరల్ మండలంలోని గుల్లపేట గ్రామానికి చెందిన జక్కుల రాజశేఖర్-మనీషా దంపతులు గుల్లపేట పాఠశాల అభివృద్ధికి రూ. 5 వేల విరాళం అందజేశారు. వీరి కుమారుడు శివాన్ష్ పుట్టిన రోజు సందర్భంగా విరాళం అందజేసినట్లు వారు తెలిపారు. ఈకార్యక్రమంలో తాజామాజీసర్పంచ్ జక్కుల తిరుపతి, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమిని తిరిగి రైతులకు అప్పగించాలి

వేములవాడ టౌన్, ఫిబ్రవరి 13 : వేములవాడ మున్సిపల్ పరిధిలోని తిప్పాపూర్ శివారులో జయవరం రోడ్డు వైపు ఉన్న ప్రభుత్వ భూమిని తిరిగి రైతులకు అప్పగించాలని సీపీఐ నియోజకవర్గ ఇన్‌చార్జి కడారి రాములు డిమాండ్ చేశారు. తిప్పాపూర్ శివారులోని భూమిని పార్టీ నాయకులతో కలిసి మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా రాములు మాట్లాడుతూ సీపీఐ ఎమ్మెల్యేగా రాజేశ్వర్‌రావు ఉన్న సమయంలో నిరుపేదలకు 33 ఎకరాల భూమిని ఇచ్చారని, ఆ భూమిని డబుల్ బెడ్ రూం ఇల్లు కట్టిస్తామని చెప్పి రైతుల వద్ద నుంచితీసుకున్నారని అన్నారు. ఇళ్ల కట్టకపోవడంతో ఆ భూమి ఖాళీగా ఉందని, తిరిగి ఆ భూమిని సంబంధిత రైతులకు అప్పగించాలని డిమాండ్ చేశారు. ఆయన వెంట ఎల్లా దేవరాజు, కొరెపు శ్రీనివాస్, లక్ష్మణ్ తదితరులు ఉన్నారు.

ఇటిక్యాల ఉన్నత పాఠశాలకు ఇన్‌స్పైర్ అవార్డులు



విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

రాయికల్, ఫిబ్రవరి 13: మండలం ఇటిక్యాల గ్రామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు 2023-24 సంవత్సరానికిగాను ఇన్నోవేషన్ ఇన్ సైన్స్ పర్స్యూట్ ఫర్ ఇన్‌స్పైర్ రీసెర్చ్ అవార్డులకు ఎంపికైనట్లు ప్రధానో పాధ్యాయుడు ఎస్.సదాశివ్ తెలిపారు. ఈ పథకం భారత ప్రభుత్వంలోని డిపార్ట్‌మెంట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ ఫ్లాగ్‌షిప్ ప్రోగ్రాంలో ఒకటని పేర్కొన్నారు. ఇన్‌స్పైర్ అవార్డ్స్, మిలియన్ మైండ్స్ ఆగ్మెంటింగ్ నేషనల్ ఆస్పిరేషన్స్ అండ్ నాలెడ్జ్, నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్ ఇండియా స్వయం ప్రతిపత్త సంస్థతో కలిసి అమలు చేస్తున్నారని ఆయన వివరించారు. 6వ తరగతి నుంచి 10 తరగతి చదువుతున్న విద్యార్థులను ప్రోత్సహించడం దీని లక్ష్యమని ఆయన తెలిపారు. విద్యార్థులు అంకతి చరణ్య, రాంచరణ్, బేతి రశ్మిత, చెట్‌పెల్లి సింధూజలు ఈ అవార్డులకు ఎంపికయ్యారని తెలిపారు. ఎంపికైన విద్యార్థులను, సైన్స్ ఉపాధ్యాయులను ఉపాధ్యాయులు రాజేశం, శేఖర్, మహేశ్వర శర్మ, రమేష్, శాంతకుమారి, జియావొ ద్దీన్, పి.హన్మంతరావు, సంపత్ కుమార్ అభినందించారు.

ఉపాధ్యాయులు నిత్య విద్యార్థులు : ఎంఈవో

రాయికల్, ఫిబ్రవరి 13: ఉపాధ్యాయులు వృత్యంతర శిక్షణలో భాగంగా నిత్య విద్యార్థులు అని రాయికల్ ఎంఈవో ములస్తం గంగాధర్ అన్నారు. రాయికల్ బాలుర ఉన్నత పాఠశాలలో మంగళవారం పాఠశాల సముదాయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలల ఉపాధ్యాయులు వారి పాఠశాలల్లో నిర్వహిస్తున్న వినూత్న కార్యక్రమాలు, తొలిమెట్టు కార్యక్రమంలో భాగంగా నిర్వహిస్తున్న కార్యక్రమాలు, ఆదర్శ బోధనా పద్ధతుల గురించి చర్చించారు. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ విద్యార్థులు కనీస సామర్థ్యాలు సాధించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని కోరారు. ప్రణాళికల ఆధారంగా బోధించాలని, విద్యార్థుల ముఖ గుర్తింపు హాజరు సకాలంలో వే యాలన్నారు.

ఈ కార్యక్రమంలో మండల నోడల్ అధికారి శ్రీపతి రాఘవులు, ప్రధానోపాధ్యాయుడు కాపు శ్రీనివాస్, జిల్లా రిసోర్స్ పర్సన్ కడకుంట్ల అభయ్ రాజ్, మండల రిసోర్స్ పర్సన్ ఉషకోల రాము, క్లస్టర్ రిసోర్స్ పర్సన్‌లు కుడుకల రవీందర్, రాజేష్ పాల్గొన్నారు.

అక్రమ కట్టడాల కూల్చివేత



అక్రమ కట్టడాలను తొలగిస్తున్న అధికారులు

కోరుట్ల, ఫిబ్రవరి 13 : పట్టణంలోని పలు ప్రాంతాల్లో అక్రమంగా నిర్మించిన కట్టడాలను మున్సిపల్ అధికారులు కూల్చివేశారు. వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయ ఉత్తర దిక్కున నాలాను అక్రమించిన నిర్మాణం, 22వ వార్డులో రోడ్డుపై నిర్మించిన ర్యాంపు, జవహర్ రోడ్‌లో సెట్ బ్యాక్ లేకుండా నిర్మించిన చౌహన్ లలిత నిర్మాణాలను కూల్చివేసినట్లు అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా టీపీవో ప్రవీణ్, టీపీఎస్ రమ్య, ఎన్‌ఫోర్స్‌మెంట్, అగ్నిమాపక సిబ్బంది, పోలీస్, ఆర్అండ్‌బీ అధికారులు పాల్గొన్నారు.

దేశ సంరక్షణ పీఎం మోదీతోనే సాధ్యం

బీజేవైఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు దోనికేల నవీన్

మెట్‌పల్లి, ఫిబ్రవరి, 13 : దేశ సంరక్షణ ప్రధానమంత్రి నరేంద్ర మోదీతోనే సాధ్యమవుతుందని బీజేవైఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు దోనికేల నవీన్ అన్నారు. మంగళవారం పట్టణంలోని 14వ వార్డుల్లో నిర్వహించిన గావ్ చలో బస్తీ చలో అభియాన్ కార్యక్రమంలో భాగంగా గడపగడపకు తిరిగి కేంద్ర ప్రభుత్వం సాధించిన విజయాలు, అందజేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తూ కరపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని ప్రతి గ్రామంలో, మున్సిపాలిటీల్లో జరిగే అభివృద్ధి పనులకు పీఎం నరేంద్రమోదీ నేతృత్వంలో కేంద్ర ప్రభుత్వం నిధులు అందజేస్తామన్నారు. పేదల సంక్షేమం మహిళా సాధికారిత అంతర్గత బావ్య భద్రత సంస్కృతి పునరుద్ధరణ, విదేశాల్లో భారత దేశ గౌరవాన్ని పెంచి అన్ని రంగాల్లో దేశాన్ని బీజేపీ ప్రభుత్వం అభివృద్ధి చేశారన్నారు. ఎలాంటి అవినీతి, అక్రమాలు లేకుండా దేశంలో ఆరు నెలల్లోనే 8 లక్షల ఉద్యోగాలు ఇచ్చిన ఘనత పీఎం నరేంద్రమోడీదేనని అన్నారు. కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న ఉజ్వాల గ్యాస్ కనెక్షన్, గరీబ్ కళ్యాణ యోజన, ఆయుష్మాన్ భారత్, విశ్వకర్మ ముద్ర లోన్స్, జనధన్ యోజన, పీఎం కిసాన్, సన్ నిధితో పాటు తదితర పథకాలు అర్హులైన వారు సద్వినియోగం చేసుకునేలా ప్రజలకు తెలియజేయాలన్నారు. పీఎం నరేంద్రమోడీ నేతృత్వంలో సాధించిన విజయాలు, సంక్షేమ పథకాలు, అభివృద్ధిని బూత్ స్థాయి కమిటీ సభ్యులు ప్రతి ఇంటికి వివరించాలని, మళ్లీ దేశ ప్రధానిగా నరేంద్రమోదీని గెలుపుంచుకోవడానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పార్టీ కౌన్సిలర్ మర్రి పోచయ్య, సుంకేట విజయ్, కొయ్యల లక్ష్మణ్, తుపారపు రాజేందర్, ఆర్మూర్ రంజిత్, లోలపు సంజీవ్, హోటల్ నర్సయ్య, నాగుల అంజయ్య పాల్గొన్నారు.



మెట్‌పల్లిలోని ఇంటింటికీ కరపత్రాలను అందజేస్తున్న బీజేపీ నాయకులు

నిధుల మంజూరుపై హర్షం

కోరుట్ల రూరల్, ఫిబ్రవరి 13 : మండలంలోని వెంకటాపూర్ గ్రామంలో సీసీ రోడ్డు నిర్మాణానికి రూ. 8 లక్షలు మంజూరి చేయడంపై కాంగ్రెస్ నాయకులు హర్షం ప్రకటించారు. మంగళవారం స్థానిక విలేకర్లతో వారు మాట్లాడుతూ గ్రామంలో రూ. 8ల క్షలు నిధులు మంజూరి కృషి చేసిన కాంగ్రెస్ నియోజకవర్గం ఇన్‌చార్జు జువ్వాడి నర్సింగరావు, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు జువ్వాడి కృష్ణారావు, మండల అధ్యక్షుడు కొంతం రాజంలకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ గ్రామ స్థాయి నాయకులు రవీందర్ రెడ్డి, బర్మం చిట్టిబాలు, మాజీ ఎంపీటీసీ సభ్యుడు బర్లం నర్సయ్య పాల్గొన్నారు.

గంభీర్‌పూర్ సొసైటీకి స్ప్రే డ్రోన్ మంజూరు

కథలాపూర్, ఫిబ్రవరి 13 : మండలంలోని గంభీర్‌పూర్ సింగిల్ విండో కార్యాలయానికి స్ప్రే డ్రోన్ మంజూరైనట్లు చైర్మన్ దాసరి గంగాధర్, సీఈవో విజయ్ తెలిపారు. ప్రస్తుతం డీఏపీ, యూరియా ద్రవ రూపంలో వస్తున్న నేపథ్యంలో రైతాంగం వాటిని స్ప్రే చేసేందుకు మొగ్గుచూపుతోందన్నారు. ఇఫ్‌కో కంపనీ సుమారు రు. 12 లక్షల విలువ చేసే డ్రోన్, ఆటో సొసైటీకి మంజూరు చేసిందన్నారు. రాష్ట్రంలో కేవలం నాలుగు సొసైటీలకే కంపనీ మంజూరు చేయగా గంభీర్‌పూర్ సొసైటీ ఎంపిక కావడంతో రైతులకు మేలు జరగనుందన్నారు. రైతులు అద్దె చెల్లించి డ్రోన్‌ను వినియోగించుకోవడానికి అవకాశం దక్కిందన్నారు.

పెగడపల్లి తహసీల్దార్‌గా శ్రీనివాస్

పెగడపల్లి, ఫిబ్రవరి 13 : పెగడపల్లి తహసీల్దార్‌గా ఆర్.శ్రీనివాస్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఎన్నికల కమిషన్ బదిలీలలో భాగంగా ఇప్పటి వరకు తహసీల్దార్‌గా పని చేసిన ఎం.ఏ.ఫారూక్ సిరిసిల్ల జిల్లాకు బదిలీపై వెళ్లగా నిర్మల్ జిల్లా నుంచి వచ్చిన శ్రీనివాస్‌ను పెగడపల్లి తహసీల్దార్‌గా నియమిస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేయగా మంగళవారం విధుల్లో చేరారు.

ధర్మపురి మున్సిపల్ కమిషనర్ బదిలీ

ధర్మపురి, ఫిబ్రవరి 13: ధర్మపురి మున్సిపల్ కమిషనర్ సీహెచ్ రమేష్ బదిలీ అయ్యారు. ఈ మేరకు ప్రభుత్వం బదిలీ ఉత్తర్వులు జారీ చేసింది. నిర్మల్ జిల్లా ఖానాపూర్ మున్సిపల్ కమిషనర్‌గా పని చేస్తున్న ఎన్. శ్రీనివాస్ రెడ్డిని ఆయన స్థానంలో ఇక్కడికి బదిలీ చేశారు. కమిషనర్ రమేష్ ఇక్కడి నుంచి రిలీవ్ కాలేదు. ఇక్కడికి బదిలీ చేసిన శ్రీనివాస్‌రెడ్డి త్వరలో పదవీ బాధ్యతలు స్వీకరిస్తారని తెలుస్తుంది.

కోరుట్ల మున్సిపల్ కమిషనర్‌గా తిరుపతి

కోరుట్ల, ఫిబ్రవరి 13 : కోరుట్ల మున్సిపల్ కమిషనర్‌గా తిరుపతి నియమితుడయ్యాడు. కోరుట్ల మున్సిపల్‌లో రెవెన్యూ అధికారిగా బాధ్యతలను నిర్వహిస్తున్న తిరుపతిని నియమిస్తూ ప్రభుత్వ పిన్సిపల్ సెక్రటరీ దాన కిశోర్ సోమవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశాడు. ఈ నెల 14వ తేదీన విధులకు హాజరు కావాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ప్రస్తుతం పని చేస్తున్న కమిషనర్ రాజేశ్వర్ మంగళవారం సాయంత్రం ఐదు గంటల వరకు విధులు నిర్వహించారు. అతనికి ఇప్పడి వరకు ఎక్కడికి బదిలీ అయినట్లు ఉత్తర్వులు రాకపోవడం విశేషం.

ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షల తనిఖీ

కథలాపూర్, ఫిబ్రవరి 13 : మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జరుగుతున్న ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలను మంగళవారం జిల్లా ఇంటర్మీడియెట్ అధికారి నారాయణ ఆకస్మికంగా తనిఖీ చేశారు. పరీక్షల నిర్వహణను చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ నెల 16న జరగబోవు ఇంగ్లీష్ ప్రాక్టికల్ పరీక్ష నిర్వాహణ గురించి అధ్యాపకులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం పదవ తరగతి, ఇంటర్ వార్షిక పరీక్షలకు సంబంధించి ముద్రించిన టైంటేబుల్ కార్డులను విడుదల చేశారు. కళాశాలలో అడ్మి షన్ల సంఖ్య పెంచాలని సూచించారు. ప్రిన్సిపాల్ గౌసుర్ రహమాన్, అధ్యాపకులు ఉన్నారు.

బాధ్యతలు స్వీకరించిన ఎస్సై

ఇబ్రహీంపట్నం, ఫిబ్రవరి 13 : ఇబ్రహీంపట్నం ఎస్సైగా ఏ.అనిల్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఇంతకు ముందు ఎస్సైగా విధులు నిర్వర్తించిన ఉమాసాగర్ వెల్గటూర్‌కు బదిలీ కాగ వెల్గటూర్ ఎస్ఐ విధులు నిర్వర్తిస్తున్న అనిల్ బదిలీపై ఇబ్రహీంపట్నంకు రాగ మంగళవారం బాధ్యతలు చేపట్టారు. బాధ్యతలు చేపట్టిన ఎస్సై అనిల్‌ను సిబ్బంది స్వాగతం పలికారు.

16న దేశవ్యాప్త కార్మిక సమ్మె

సిరిసిల్ల టౌన్, ఫిబ్రవరి 13 : కేంద్రంలోని బీజేపీ కార్పొరేట్, మతతత్వ విధానాలను ప్రతిఘటిస్తూ ప్రధాని మోదీ వైఫల్యాలను ఎండగడుతూ ఈ నెల 16న నిర్వహించనున్న దేశవ్యాప్త కార్మిక సమ్మె, గ్రామీణ భారత్ బంద్‌ను జయప్రదం చేయాలని సీపీటీయూ జిల్లా కార్యదర్శి కోడం రమణ పిలుపునిచ్చారు. మంగళవారం సిరిసిల్ల పట్టణం మున్సిపల్ కార్యాలయం ఆవరణలో తెలంగాణ మున్సిపల్ ఎంప్లాయిస్, వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) ఆధ్వ ర్యంలో సమ్మె పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రమణ మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, రైతు, ప్రజా వ్యతిరేఖ విధానాలకు నిరసనగా సమ్మె చేపడుతున్నట్లు చెప్పారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఎగమంటి ఎల్లారెడ్డి, తెలంగాణ మున్సిపల్ ఎంప్లాయిస్, వర్కర్స్ యూనియన్ నాయకులు, పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.